నాలాలు, డ్రైనేజీల్లో వ్యర్థాలు
తొలగించడంలో మీనమేషాలు!

- డీసిల్టింగ్ పనులు చేపట్టని సంబంధిత అధికారులు
- వ్యర్థాలు పేరుకుపోయి పొంగుతున్న డ్రైనేజీలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు


నిజాంపేట్ వార్డు ఆఫీస్ రోడ్డులో పారుతున్న మురుగు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మురుగు పరుగులు తీస్తోంది. ఎప్పటికప్పుడు డ్రైనేజీ లీకేజీలను అరికట్టాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నెలల తరబడి సమస్యలు తిష్టవేసినా అధికారులు మాత్రం వాటిని పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీల మరమ్మతుల సమస్య చాలా తీవ్రమైంది. ఇలాంటి సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన అభివృద్ధి పనుల విషయంలో మాత్రం అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు, కార్పొరేటర్లకు బాధ్యత లేదా?

అసలే వర్షకాలం ఆపై డ్రైనేజీ లీకేజీలు ఉంటే ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి చిన్న చిన్న విషయాలను అధికారులు ఎందుకు గుర్తించడం లేదు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కేవలం సుమారు 5 కిలోమీటర్ల విస్తీర్ణంలోనే కాలనీలు, బస్తీలు ఉన్నాయి. ప్రతి డివిజన్‌కు సూపర్‌వైజర్లు, అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. మరి అంతే కాకుండా స్థానిక కార్పొరేటర్లు సైతం ఉన్నారు. ఇంత మంది ఉన్న ఆయా డివిజన్లల్లో నెల కొన్న డ్రైనేజీ సమస్య కనిపించడం లేదా.? లేక కనిపించిన చూసి చూడనట్లు వదిలేస్తున్నారా? అనేది అంతు చిక్కడం లేదు. అధికారులు, కార్పొరేటర్లకు బాధ్యత లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు...

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న డ్రైనేజీ నీరు ప్రవహించే నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు సాఫీగా వెళ్లడం లేదు. జగన్ స్టూడియో నుంచి సాయినగర్, ఆదిత్య గార్డెన్ మీదుగా తుర్కు చెరువు వరకు వెళ్లే నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. అదే విధంగా రాజధాని స్కూల్ వద్ద నుంచి ప్రవహించే నాలాల్లో సైతం డ్రైనేజీ నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. బాచుపల్లిలో సైతం ఇదే పరిస్థితి ఇలా ప్రతి ప్రాంతంలో ఈ సమస్య ఉంది.



లీకేజీలను అరికట్టడంలో విఫలం...

డ్రైనేజీ మ్యాన్ హోల్స్ లీకేజీలను సకాలంలో అరికట్టడంలో సైతం సిబ్బంది విఫలమవుతున్నారని ప్రజలు బాహాటంగానే అంటున్నారు. తమ ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీ ఉందని సమాచారం ఇచ్చినా సకాలంలో లీకేజీలను అరికట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ ఒత్తిడి చేస్తే సిబ్బంది సరిగ్గా పూర్తి స్థాయిలో లేరని సమాధానం చెబుతున్నట్లు తెలుస్తుంది. వర్షకాలంలో డ్రైనేజీ లీకేజులు తరచుగా జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో ఎక్కడి అక్కడే అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుందో అనే విషయాన్ని గమనించకపోవడం విశేషం.

ప్రబలుతున్న విష జ్వరాలు..

రోడ్లపై ఎక్కడి అక్కడే డ్రైనేజీ లీకేజీలు, ఎక్కడ పడితే అక్కడ డ్రైనేజీ నీటి నిల్వ, నాలాలను శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే మలేరియా, వైరల్, డెంగీ జ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలు అవుతున్నారు. దీనికి తోడు పరిసరాల అపరిశుభ్రత తోడైతే ఇంకేముంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను పరిష్కారించాలని స్థానికులు కోరతున్నారు.


రాజధాని స్కూల్ పక్కన ఉన్న నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలతో నిలిచిన మురుగు

గంజాయి పరఫరా, వినియోగాన్ని అరికట్టాలి

సీఎంకు లేఖ రాసిన ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో గంజాయి పరఫరా, వినియోగాన్ని అరికట్టాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ సోమవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మాజీ సీఎం కేసీఆర్ వీటిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసారన్నారు. ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా గంజాయి లభించడం, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాల్సి విద్యార్థులు పెడదోవ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలనీల అభివృద్ధి కృషి చేయాలి


శ్రీనివాస్ నగర్ కార్యవర్గంతో కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: కాలనీలను అభివృద్ధి పరచడానికి సంక్షేమ సంఘాలు తమ వంతు పాత్ర పోషించాలని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్ తన కార్యవర్గంతో కలసి కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్‌కు వారు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్. ఖలీల్. ఖయ్యూం, గోవర్ధన్ ప్రకాష్. తదితరులు పాల్గొన్నారు.

మొక్కను నాటండి.. తల్లిపై ప్రేమను చాటండి

మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ తల్లిపై ప్రేమతో మొక్కను నాటాలని బీజేపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిని బీజేపీ కైవసం చేసుకోవడం పార్టీలో నూతన ఉత్సాహాన్ని కలిగించదన్నారు. ఈనెల 6వ తేదీన దివంగత బీజేపీ జాతీయ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారి జయంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్ సాగర్, నేతలు మంగేశ్ కుమార్, ప్రసన్న, విఘ్నేశ్వర్, రఘుపతి, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు పథకంపై ప్రత్యేక సమావేశం

రైతుల అభిప్రాయాలు స్వీకరించిన అధికారులు


దూలపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గరిశె నరేందర్

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతుబంధు పథకంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. బౌరంపేటలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా సహకార అధికారి కె.రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాగు చేసే రైతులకు మాత్రమే రైతు బంధు వర్తింపజేయాలన్నారు. 5 నుంచి 10 ఎకరాల వరకే రైతు బంధు డబ్బులు జమ చేయాలని పలువురు రైతులు సూచించారు. వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు నల్తూరి కృష్ణ, డైరెక్టర్లు వెంకటేశ్, యాదయ్య, శ్రీనివాస్, భీమ్‌రెడ్డి, పద్మావతి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా దూలపల్లిలోని సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ గరిశే నరేందర్ ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి మేరి, సహకార శాఖ అధికారి ఆంజనేయులు లు ముఖ్య అతిథులుగా హాజరై రైతుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో సీఈఓ కృష్ణ, డైరెక్టర్లు మధుసూదన్, సత్యనారాయణ, మల్లేశ్, కృష్ణ, మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.



జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌గా జి.మల్లేష్



జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా జి.మల్లేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న మల్లేష్ సాధారణ బదిలీల్లో భాగంగా జీడిమెట్ల పీఎస్‌కు బదిలీపై వచ్చారు. జీడిమెట్లలో పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు బదిలీల్లో బాగంగా సైబర్ క్రైమ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ.. జీడిమెట్ల పీఎస్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించొద్దు

కుత్బుల్లాపూర్: ఆర్‌బీఐ ఆదేశాల మేరకు విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ చెల్లించొద్దని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే, ఇతర బ్యాంకింగ్ సేవల నుంచి విద్యుత్ బిల్లులను చేయవద్దన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోని టీజీఎస్‌పీడీసీఎల్ మొబైల్ యాప్‌లో మాత్రమే చెల్లింపులు చేయాలని సూచించారు.

సూరారం ఇన్‌స్పెక్టర్‌గా భరత్‌కుమార్



సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. భరత్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన వెంకటేశం ఓ కేసు విషయమై ఏసీబీ అధికారులకు చిక్కారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థానంలో గచ్చిబౌలి ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన భరత్‌కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని పేర్కొన్నారు. క్రైమ్ రేట్ తగ్గించడానికి త్వరలో కాలనీలు, బస్తీల వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశం అవుతామని తెలిపారు.

వాటర్ వర్క్స్ అదనపు జీఎంగా అశోక్

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎంగా అశోక్ నియమితులై సోమవారం బాధ్యతలు చేపట్టారు. సైనిక్‌పురి డివిజన్‌లో జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న అశోక్ కుత్బుల్లాపూర్ డివిజన్‌కు అదనపు జనరల్ మేనేజర్‌గా నియమితులై నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం డీజీఎంలు, మేనేజర్లు, ఉద్యోగ సిబ్బంది, కాంట్రాక్టర్లు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సీజీఎం శ్రీధర్‌రెడ్డి అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

కొత్త చట్టం కింద రెండు కేసులు నమోదు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు పోలీస్‌స్టేషన్లల్లో సోమవారం కొత్త చట్టాలను అనుసరించి కేసులు నమోదు అయ్యాయి. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత్) ప్రగతినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉన్న ఓ కుటుంబంలోని మహిళ చిన్నారి (32) సోమవారం ఇంటి పక్కన వారితో గొడవ జరిగింది. మనోవేధనకు గురైన ఆమె సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్నారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మరో ప్రాంతంలో వ్యక్తి..

అదే విధంగా జగద్గిరిగుట్టలో సైతం ఇదే సెక్షన్ కింద ఓ కేసు నమోదైంది. ఆ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాపారంలో నష్టం వస్తుందని ఆందోళన చెందిన సయ్యద్ దిల్‌వార్(31)భార్య ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదుతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు మృతి చెందాయి.. పరిహారం ఇప్పించాలి

నిజాంపేట్: బాచుపల్లి మండలం రాజీవ్‌గాంధీనగర్‌లోని పత్తికుంట చెరువులో ఈనెల 29న వేలాది చేపలు మృతి చెందాయి. ఈ విషయంపై సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పత్తికుంట సరిహద్దును అనుకుని ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు, ఓ ఫంక్షన్‌హాల్ నుంచి ఇతర వ్యాపార సముదాయాల నుంచి డ్రైనేజీ నీరు పత్తికుంట చెరువులో కలుస్తుంది. దీంతోనే చెరువులోని నీరంతా కలుషితమైన చేపలు మృత్యువాత పడ్డాయని ముదిరాజ్ సంఘం నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వేలాది చేపల మృతితో ముదిరాజులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సిన వస్తోంది. ఈ సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం, బాచుపల్లి మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారయణ, సురేశ్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ధర్మారెడ్డికాలనీ ఫేజ్-2 అధ్యక్షుడిగా నరసింహారెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ ధర్మారెడ్డికాలనీ ఫేజ్-2 కాలనీ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా మున్నంగి నరసింహారెడ్డిని 2024 నుంచి 2026 జులై వరకు తిరిగి ఎన్నుకున్నారు. అదే విధంగా కోశాధికారిగా చీకోటి దయాకర్‌గుప్త, జనరల్ సెక్రటరీగా ఆర్.వెంగళ్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా బొంపల్లి మధుసూదన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడిని కాలనీ వాసులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి


డీఈఓ విజయకుమారికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నిజాంపేట్: ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితి కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సోమవారం మేడ్చల్ డీఈఓ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పని చేస్తుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేసే జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీ ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న గురుకులాల్లో సైతం జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ పద్మారెడ్డి, జిల్లా కోశారికారి అశోక్,రవి, గడ్డమీది అశోక్, పీట్ల శంకర్ సంజీవ్ కుమార్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు


డాక్టర్స్ డే కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే)ను పురస్కరించుకొని ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ చేతుల మీదుగా కేక్ కట్ చేపించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... వైద్యులను దేవుడితో సమానంగా చూడటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో పాటు కమిటీ అధ్యక్షులు విష్ణువర్ధన్, రవికుమార్, రాము, శోభన్ బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నార్త్ సిటీ హై స్కూల్‌లో..

సుభాష్‌నగర్: కనిపించే దేవుడే వైద్యుడని నార్త్ సిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. డాక్టర్స్ డే ను పురస్కరించుకొని సూరారం లోని నార్త్ సిటీ హైస్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను డాక్టర్ లుగా మార్చి వైద్యం యొక్క గొప్పతనాన్ని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న పలు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎన్నో లక్షల మంది ప్రాణాలను కాపాడిన ఘనత వైద్యులదని గుర్తు చేశారు.

గతంలో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో తెలంగాణ రియల్‌ఎస్టేట్ రంగం దేశంలోనే అతి వేగంగా అభివృద్ధి చెంది పెట్టుబడులకు స్వర్గధామంగా నిలిచిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'నా రేట్ కో'కూకట్‌పల్లి జోన్ నూతన కార్యవర్గం సభ్యులు వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కూడా రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నానన్నారు. అనంతరం నా రేట్ కో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మేక శివరాంప్రసాద్‌ని శాలువాతో సత్కరించారు. అదేవిధంగా నా రెడ్ కో కూకట్‌పల్లి జోన్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నా రేట్ కో కూకట్‌పల్లి జోన్ అధ్యక్షులు పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మక్కెన వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారులు జి.రామ స్వామి, ప్రధాన కార్యదర్శి టీ. భాస్కర్ రావు, సంయుక్త కార్యదర్శి వై. సుశీల్ కుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

తుల్జా భవాని అమ్మవారికి పూజలు

◆ అదే విధంగా నిజాంపేట మధురానగర్ కాలనీలో 'తుల్జా భవాని'అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కత్తిని ఎమ్మెల్యే వివేకానంద్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మధురానగర్ ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్ రావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుంకరి ఆనంద్ ఉగాది కీర్తిరత్న పురస్కారం

జీడిమెట్ల: తన సేవలను గుర్తించి ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ వారు తనకు ఉగాది కీర్తిరత్న పురస్కారం అందించడం సంతోషంగా ఉందని సమాజ సేవకులు విద్యావేత్త సుంకరి ఆనంద్ అన్నారు. ఆదివారం మలేషియాలో ఎఫ్ఎన్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుంకరి ఆనంద్‌పద్మలకు పురస్కారం అందజేశారు. ఆనంద్ గత కొన్ని సంవత్సరాలుగా అనాథ పిల్లలకు అండగా ఉంటూ రోడ్లపై అభాగ్యులను గుర్తించి వారిని పునరావాస కేంద్రాల్లో చేర్చడంతో పాటు వివాహ పరిచయ వేదికలు నిర్వహించడంలాంటి ఎన్నో సమాజసేవ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇది గుర్తించిన తెలుగు అసోషియేషన్ ఆఫ్ మలేసియా, ఎఫ్ఎన్‌సీఏ వారు ఆయనకు ఉగాది కీర్తిరత్నం పురస్కారం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టీఏఎం పూర్వ అధ్యక్షులు డా.అశోక్ కుమార్ రావు, మలేషియా తెలంగాణ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు బూరెడ్డి మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మూడు చైన్‌స్నాచింగ్స్ చేసింది ఒక్కడే..

- గతంలో నిందితుడిపై 36 చైన్‌స్నాచింగ్ కేసులు
- 1వ తేదీన పోలీసులకు చిక్కిన మహేందర్‌సింగ్
- రూ.5లక్షల విలువైన బంగారం, బైక్ స్వాధీనం
- కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

నిజాంపేట్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడిని బాలనగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలనగర్ జోన్ డీసీపీ కె. సురేశ్‌కుమార్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌సింగ్ ప్రస్తుతం విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 24న సాయంత్రం నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి 3 తులాల బంగారు గొలుసును దొంగిలించారు.

◆ అదే విధంగా ఈ నెల 25న జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సైతం చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నించాడు. అయితే అక్కడ ఓ యువతి ప్రతిఘటించడంతో అతడి ప్రయత్నం విఫలమయ్యింది. అదే రోజు జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులకు మూడు స్నాచింగ్‌లకు పాల్పడింది ఒకే వ్యక్తి అని సీసీ ఫుటేజీల ద్వారా నిర్ధారించుకున్నారు. అనంతరం దర్యాప్తు ముమ్మరం చేసి మహేందర్‌సింగ్ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

◆ ఈ నేపథ్యంలో సోమవారం పోలీసులు మమత ఆస్పత్రి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడే దొంగిలించిన బంగారంతో పల్సర్ బైక్‌పై అనుమానస్పందంగా కనిపించడంతో ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడింది తనే అని ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు సుమారు రూ.5 లక్షల విలువైన బంగారం, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

◆ 2012 నుంచి 2015లో పలు పోలీస్‌స్టేషన్ల 36 చైన్ స్నాచింగ్ కేసులు మహేందర్ సింగ్‌పై ఉన్నాయని తెలిపారు. దీంతో గతంలో ఇతడిపై పీడీ యాక్ట్ సైతం నమోదయ్యింది. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని త్వరగా అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్, ఎస్ఓటీ పోలీసులను డీసీపీ అభినందించారు.

పేట్‌బషీరాబాద్ ఠాణాలో డీసీపీ అకస్మిక తనిఖీలు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన పలు పోలీస్ స్టేషన్లను అకస్మికంగా తనిఖీ చేస్తూ రికార్డులు పరిశీలిస్తూ కేసుల పురోగతిపై ఆరా తీస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సందర్శించిన కోటిరెడ్డి కేసుల రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు వచ్చే ఫిర్యాదుదారుల విషయంపై వ్యవహరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి మర్యాదపూర్వక ఆహ్వానం పలికి కేసు వివరాలను తెలుసుకోవాలన్నారు. ఎవరు అమర్యాదగా ప్రవర్తించినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, డీఐ నరసింహ రాజు, ఎస్సైలు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏరియాల్లో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి స్టేటస్ విషయంపై ఆరా తీశారు.


సిబ్బందితో మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

మంత్రివర్గంలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలి

కుత్బుల్లాపూర్: రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలని తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథం పటేల్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీసీల్లో అత్యధిక జనబలం కలిగిన మున్నూరు కాపులకు మంత్రివర్గంలో చోటు లేకపోవడం దురదృష్టకరమని, త్వరలో తీసుకోబోయే మంత్రివర్గంలో మున్నూరు కాపుకు అవకాశం కల్పించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో మున్నూరు కాపుల జనాభ ప్రకారం సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్, హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిటి నిఖిల్, ప్రచార కార్యదర్శి జంగిల్ అఖిల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్త అశోక్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.